బైపాస్‌కు మోక్షమెప్పుడో?

- కొత్త ప్రభుత్వంలోనైనా కదలిక వచ్చేనా
- మధ్యలోనే నిలిచిన బైపాస్ నిర్మాణ పనులు
- ప్రతిపాదనలకే పరిమితమవుతున్న వైనం


కొత్తగూడెం- పాల్వంచ బైపాస్ రోడ్డు

చుంచుపల్లి: కొత్తగూడెం-పాల్వంచలను కలిపే బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు ఏళ్లుగా కలగానే మిగిలాయి. జంట పట్టణాలైన కొత్తగూడెం, పాల్వంచలను కలుపుతూ ట్రాఫిక్ సమస్యను నివారించాలనే ఉద్దేశంతో 2014లో మొదట రూ.33 కోట్ల వ్యయ అంచనాలతో కొత్తగూడెం బైపాస్ రహదారి పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. అయితే మొదట్లో నిర్మాణ పనులు చురుగ్గా జరిగినప్పటికీ ఆ తర్వాత నత్తనడక కొనసాగుతూ చివరకు మధ్యలోనే నిలిచిపోయాయి. అయినా పట్టించుకునే నాథులే కరువయ్యారు. అయితే ఇటీవల రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొంత ఆశలు చిగురిస్తున్నాయి. అటు కొత్తగూడెం ఎమ్మెల్యేగా గెలుపొందిన కూనంనేని సాంబశివరావు సైతం బైపాస్ నిర్మాణ పనులకు మోక్షం కలిగించాలనే పట్టుదలతో ఉన్నారు. ఇప్పటికే దీనిపై ఆయన సంబంధిత అధికారులతో కావాల్సిన నిధులు, ఇంకా చేపట్టాల్సిన పనులపై చర్చించారు. కొత్తగూడెం బైపాస్ రహదారి ఏర్పాటు వల్ల ప్రధానంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీరే అవకాశం ఉంటుంది. అయితే తొమ్మిదేళ్లుగా నిధుల లేమితో పాటు అనేక కారణాలతో బైపాస్ నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. అయితే ఇప్పటి వరకు కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. బైపాస్ రహదారిపై రెండు ప్లెటైవర్లతో పాటు సర్వీసు రోడ్లు, జంక్షన్లు ఏర్పాటుకు మరో రూ.153 కోట్ల నిధులను కేటాయించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. వీటి విషయంలో ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావాల్సి ఉంది. బైపాస్ నిర్మాణం పట్ల గతంలో స్థానిక ప్రజాప్రతినిధులు సైతం అంతగా పట్టించుకోకపోవడంతో దీని పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. ఈ బైపాస్ రహదారి పనులను విద్యానగర్, ఎన్కే నగర్, బాబు క్యాంప్, పెనుబల్లి, గంగబిషన్ బస్తీ, పాత కొత్తగూడెం మీదుగా నవభారత్ వరకు పూర్తి చేయాల్సి ఉంది. ఈ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతున్నాయనే ఉద్దేశంతో రైతులు అప్పట్లో భూములు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. బైపాస్ రహదారి నిర్మాణం కోసం చాలామంది రైతులు తక్కువ ధరలకే తమ వ్యవసాయ భూములను ఇచ్చారు. తొమ్మిదేళ్లు దాటినా బైపాస్ రహదారి నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. బైపాస్ అందుబాటులోకి రాకపోవడంతో ప్రతీరోజు వందలాది వాహనాలు కొత్తగూడెం పట్టణం మీదుగానే పాల్వంచ వెళ్తున్నాయి. దీంతో కొత్తగూడెం పట్టణంలో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. వందల కొద్ది లారీలు, భారీ వాహనాలు పట్టణం మధ్యలో నుంచి వెళ్తున్నాయి. దీంతో వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. బైపాస్ అందుబాటులోకి వస్తే కొత్తగూడెం పట్టణంలోకి భారీ వాహనాలు వెళ్లకుండా విద్యానగర్ బైపాస్ నుంచే నేరుగా పాల్వంచ చేరుకోవచ్చు. కొత్తగూడెం- పాల్వంచ బైపాస్ రహదారి విషయంలో ఆర్ అండ్‌బీ ఏఈ గణేష్‌ను సంప్రదించగా బైపాస్ 2 ఫ్లెవైర్‌తో పాటు మిగిలిన పనుల నిమిత్తం ప్రభుత్వానికి మరో రూ.153 కోట్లకు ప్రతిపాదనలు పంపామని చెప్పారు. ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

చొరవ తీసుకోవాలి..



కొత్తగూడెం- పాల్వంచ బైపాస్ పనులు నిలిచిపోయి చాలా కాలం అవుతోంది. బైపాస్ అందుబాటులోకి వస్తే కొత్తగూడెం వెళ్లకుండానే విద్యానగర్ నుంచి నేరుగా పాల్వంచకు వెళ్లవచ్చు. అంతేకాకుండా విద్యానగర్ నుంచి పాల్వంచ నవభారత్ వరకు ఉన్న ప్రాంతాలు, గ్రామాలు అభివృద్ధిలోకి వస్తాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని పనులు మొదలు పెట్టేలా చూడాలి.

– భూక్యా రమేష్, సీపీఎం నాయకుడు

కాంగ్రెస్ గెలుపు అభివృద్ధికి మలుపు


మాట్లాడుతున్న అభ్యర్థి రఘురాంరెడ్డి, పక్కన ఎమ్మెల్యే కూనంనేని తదితరులు

కొత్తగూడెంరూరల్/సింగరేణి(కొత్తగూడెం): ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని గెలిపించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. లక్ష్మీదేవిపల్లి మండలంలో శుక్రవారం నిర్వహించిన ముస్లిం ఐక్యవేదిక ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో అంతా సమష్టిగా పనిచేసిన తనను గెలిపించిన మాదిరి లోక్‌సభ ఎన్నికల్లో రఘురాంరెడ్డిని గెలిపించాలన్నారు. తద్వారా మత రాజకీయాలు చేస్తున్న బీజేపీకి చెక్ పెట్టొచ్చని తెలిపారు. అనంతరం అభ్యర్థి రఘురాంరెడ్డి మాట్లాడుతూ ఓసారి నాకు అవకాశం ఇస్తే ఉమ్మడి ఖమ్మం జిల్లాను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఆతర్వాత కొత్తగూడెంలోని వివిధ ప్రాంతాల్లో అభ్యర్థి రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే సాంబశివరావు, నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, నాయకులు నయీం ఖురేషి, జబీర్, జావెద్, అబ్దుల్ రబ్, ఆళ్ల మురళి, నాగేంద్ర త్రివేది, ఎల్.గోపాలకృష్ణ, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ: కాంగ్రెస్ పార్టీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి గెలుపు అభివృద్ధికి మలుపు అని, రాహుల్ గాంధీని ప్రధాని చేయాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ నాయకుడు పైడిపల్లి మనోహర్, గట్టాయిగూడెం యువజన సంఘం అధ్యక్షుడు పట్టా వీరకుమార్ అన్నారు. రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం గట్టాయిగూడెం ఏరియాలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు ఎంతో మేలు చేస్తున్నట్లు చెప్పారు.

జూలూరుపాడు: కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డి విజయం కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ముమ్మరంగా ముమ్మరంగా కొనసాగుతోంది. శుక్రవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. లేళ్ల వెంకటరెడ్డి, ఎంపీపీ లావుడ్యా సోనీ, మధుసూదన్‌రావు, పొన్నెకంటి సతీష్‌కుమార్, బానోత్ స్వాతి, మంగీలాల్ నాయక్, నున్నా రంగారావు, దుద్దుకూరి సుమంత్, వేల్పుల నరసింహారావు పాల్గొన్నారు.

మాస్‌లైన్ ఆధ్వర్యంలో... ఖమ్మం ఇండియా కూటమి ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని గెలిపించాలని, మతోన్మాద, ఫాసిస్ట్ బీజేపీని ఓడించాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం జూలూరుపాడు మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. పాపకొల్లు, అన్నారుపాడు, గుండ్లరేవు, పడమటనర్సాపురం, వీరభద్రాపురం, జడలచింత తదిత గ్రామాల్లో కార్యకర్తలు ఇంటింటా తిరిగి రఘురాంరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రతీ ఏటా కోటి ఉద్యోగాలు ఇస్తామని, ప్రతీ పేదోడి బ్యాంక్ అకౌంట్‌లో రూ,15 లక్షలు వేస్తామని చెప్పి మోసం చేసిన బీజేపీను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాటోత్ కృష్ణ, బానోత్ ధర్మా, వై.గోపాల్‌రావు, ధనవంతరావు, నరేష్, వీరు, కోట్యా, బాలు, బాబు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మెడికల్ బోర్డ్‌పై విచారణ జరిపించాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఇటీవల జరిగిన మెడికల్ బోర్డ్‌లపై విచారణ చేపట్టి, ఇన్‌వాలిడేషన్ అయిన వారి వ్యాధుల వివరాలు ప్రకటించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటా శివశంకర్ డిమాండ్ చేశారు. అనారోగ్యంతో తల్లడిల్లుతున్న సింగరేణి కార్మికులను అన్‌ఫిట్ చేయకుండా, పైరవీలతో వస్తే మాత్రం అన్‌ఫిట్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి అర్హులకు న్యాయం చేయాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

కాంగ్రెస్‌లో చేరిక


ఎంపీపీ సోనీని పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

జూలూరుపాడు: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు మూడు రోజులు వ్యవధి ఉన్న సమయంలో ఎంపీపీ సోనీ బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. అదేవిధంగా కాకర్ల గ్రామానికి బీఆర్‌ఎస్ నేత దొండపాటి శ్రీనివాసరావు ఆ పార్టీని వీడి ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సమక్షంలో చేరారు. గురువారం రాత్రి జరిగిన ప్రచార కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాలో ఆయా నాయకుల ఆధ్వర్యంలో 300 బీఆర్‌ఎస్ కుటుంబాలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నాయి. అదేవిధంగా శుక్రవారం రామకృష్ణాపురం పలు బీఆర్‌ఎస్ కుటుంబాలు జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

బీజేపీ విస్తృత ప్రచారం..


ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

పాల్వంచరూరల్: ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తాండ్ర వినోద్‌రావును గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని దమ్మపేట సెంటర్, శ్రీనగర్ కాలనీలలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దుకాణాల్లో వ్యాపారులను కలిసి, ఇంటింటికీ తిరిగి విస్తృత ప్రచారం చేశారు. 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కమలం పువ్వుగుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కరపత్రాలను పంపిణీ చేశారు.

అలుపెరగని ఉద్యమ నేత నర్సయ్య..


అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే సాంబశివరావు, నాయకులు

కొత్తగూడెంరూరల్/సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ ఉద్యమ నాయకుడు, కమ్యూనిస్టు నేత, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర బండెల నర్సయ్య మృతి తీరని లోటని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఈమేరకు శుక్రవారం రుద్రంపూర్‌లో ఆయన మృతదేహం వద్ద ఎమ్మెల్యే నివాళులర్పించి మాట్లాడారు. కడవరకు ఎర్రజెండా వీడని ఆయన సేవలు మరులేనివని కొనియాడారు. అలాగే, ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, అభ్యుదయ కళాసేవ సమితి రాష్ట్ర వ్యవస్థాపకులు మద్దెల శివకుమార్ తదితరులు నివాళులర్పించారు. కాగా, నర్సయ్య అంతిమ యాత్రకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే.సాబీర్‌పాషా హాజరుకాగా, గుండా రమేష్, స్టీవెన్ లాజరస్, అలిశంకర్, తాండూర్ ధనరాజ్, జోసఫ్, రవీందర్ పాల్గొన్నారు.

తాగునీటి వృథా


ఓవర్‌ఫ్లో అవుతున్న తాగునీరు

పాల్వంచ: ఇందిరాకాలనీలోని వాటర్ ట్యాంక్ నిత్యం ఓవర్ ఫ్లో అవుతూ భారీ ఎత్తున నీటి వృథా అవుతోందని స్థానికులు వాపోతున్నారు. ట్యాంక్ నిండిన తర్వాత వాల్వ్ బంద్ చేయాల్సిన సిబ్బంది అందుబాటులో లేక పోవడంతో శుక్రవారం భారీగా తాగునీరు వృథా అయింది. వేసవికాలంలో పట్టణ ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతుండగా ఇలా నీళ్ల వృథా చేస్తుండటంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీకి ఓటు అడిగే హక్కు లేదు


మాట్లాడుతున్న దేవదానం

పాల్వంచ: కర్మాగారాలను అమ్మేస్తూ, నిరుద్యోగులను పెంచుతున్న మోదీ పాలనకు స్వస్తి చెప్పాలని టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు బరగడి దేవదానం, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు అన్నారు. శుక్రవారం స్థానిక సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పదేళ్ల కాలంలో కర్మాగారాలను ప్రైయివేట్‌కు అమ్మడం వల్ల దేశం ఆర్థికంగా వెనుకబడి పోయిందని, రూపాయి విలువ పడిపోయిందని, యువతకు ఉద్యోగాలు రాక నిరుద్యోగం పెరిగిందని విమర్శించారు. మోదీ పాలనలో మహిళలపై దాడులు, విద్య, వైద్యం అందడం లేదని, ఆర్థిక నేరాలు చేసిన వారిని కేంద్రంలో మంత్రులను చేయడం, మతాలను రెచ్చగొట్టి జనాలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీకి బీసీ, ఎస్సీ, ఎస్టీలను ఓటు అడిగే హక్కు లేదన్నారు. కార్యక్రమంలో శ్రీపాద సత్యనారాయణ, ఎస్‌కె.నబీ, నిమ్మల రాంబాబు, మంజూరు అలీఖాన్, ముర్తుజా, రెహమాన్, ఖాజామియా, రామచందర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థి నామాను గెలిపించండి..


భేతాళపాడులో ప్రచారం చేస్తున్న నాయకులు

జూలూరుపాడు: బీఆర్‌ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గడగడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అదేవిధంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిని సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి లకావత్ గిరిబాబు, యల్లంకి సత్యనారాయణ, పోలుదాసు గోపాలకృష్ణమూర్తి, ఎదళ్లపల్లి వీరభద్రం, జెడ్పీటీసీ భూక్యా కళావతి, చావా వెంకటరామారావు, మూడ్ చిట్టిబాబు, దుద్దుకూరి కృష్ణప్రసాద్, నాగేశ్వరరావు, బానోత్ చందర్, మాలోత్ నరసింహారావు, బానోత్ శంకర్, బానోత్ చిన్నా, లకావత్ హేమ్లా పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి కవితకు మద్దతు ఇవ్వండి..


ప్రచారం చేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: మహబూబాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మాలోత్ కవిత విజయాన్ని కాంక్షిస్తూ మండలంలోని పలు గ్రామాలలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాఘబోయినగూడెం, ఒడ్డుగూడెం గ్రామపంచాయతీలలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు విస్తతంగా ప్రచారం చేశారు. అధికారంలో ఉన్న సమయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు గుర్తు చేసి ఓట్లను అభ్యర్థించారు. ఉద్యమాలతో సాధించుకున్న రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు బీఆర్‌ఎస్ అభ్యర్థికి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమలో మంచాల జాన్‌బాబు, పోషం రమేష్, లక్ష్మీనారాయణ, కాంతారావు, జోగ కృష్ణ, నరసయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సొంత గూటికి..

ఇల్లెందు: పట్టణంలోని వినోభానగర్ కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, మాదిగ జేఏసీ నేత ఆదూరి రవి కాంగ్రెస్‌లో చేరిన మూడు రోజులకే తిరిగి మళ్లీ సొంత గూటికి చేరాడు. శుక్రవారం బీఆర్‌ఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు దిండిగల రాజేందర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. మూడు రోజుల క్రితం ఖమ్మంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే కోరం కనకయ్యల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన విషయం విధితమే. బీఆర్‌ఎస్‌లో రాజకీయ ఓనమాలు నేర్చుకున్న తాను కాంగ్రెస్‌లో చేరినప్పటికీ మనసు అంగీకరించలేదన్నారు. అందుకే తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరినట్లు తెలిపారు.

ఓటు ఎంతో పవిత్రమైంది..


ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

పాల్వంచరూరల్: 13వ తేదీన జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతీఒక్కరూ ఓటు వేయాలని విద్యార్థులు, అధికారులు, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు. మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీఓ కె.విజయ భాస్కరరెడ్డి మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రలోభాలకు లోను కాకుండా ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు ఎంతో పవిత్రమైందని, ఓటును అమ్ముకోరాదని, విద్యార్థులు తమ కుటుంబ సభ్యులను ఓటు వేసేలా ప్రోత్సహించాలని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వై.చిన్నప్పయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీఓ బి.నారాయణ, కళాశాల అధ్యాపకులు డాక్టర్ పి.విజయ్‌కుమార్, కార్యదర్శి బి.కృష్ణవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

సిటిజన్ ఫోరం మద్దతు


కనకయ్యను సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్ సభ్యులు

ఇల్లెందు: మహబూబాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపును కాంక్షిస్తూ సాగుతున్న ప్రచారంలో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా సీనియర్ సిటిజన్ ఫోరం మద్దతు ప్రకటించింది. శుక్రవారం సభ్యులు ఇల్లెందులో ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిసి మద్దతు ప్రకటించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కృష్ణమోహన్, దామోదర్‌రెడ్డి, చంద్రశేఖర్, తాటి శ్రీనివాస్, కొండలరావు, సీతారామయ్య ఉన్నారు. ఇదిలా ఉండగా బలరాం నాయక్ గెలుపు ఖాయమని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ రమణనాయక్, రంజిత్ నాయక్, హబీబుద్దీన్, కాంగ్రెస్ నాయకులు సంతోష్‌రెడ్డి ఇల్లెందులో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు.

ఆశా కార్యకర్త మృతి


స్వాతి(ఫైల్)

సుజాతనగర్: పీహెచ్‌సీ పరిధి వేపలగడ్డ గ్రామంలో ఆశా కార్యకర్తగా పనిచేస్తున్న చెన్నబోయిన స్వాతి(28) అనారోగ్యంతో మృతి చెందింది. మూడు నెలలుగా ఆమె కీళ్లవాపుల సమస్యతో బాధపడుతోంది. కుటుంబసభ్యులు ఖమ్మం, కొత్తగూడెంలలో వైద్యం చేయించారు. మెరుగైన వైద్యం కోసం పది రోజుల క్రితం హైదరాబాద్ తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. మృతిరాలికి భర్త వీరాంజనేయులు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ రమేష్, వైద్య సిబ్బంది నివాళులర్పించారు.

ప్రజాస్వామిక హక్కులను కాపాడుకుందాం..


టేకులపల్లిలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు


ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న అనురాధ

టేకులపల్లి: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్లమెంట్ అభ్యర్థి మోకాళ్ల మురళీకృష్ణ కుండ గుర్తుపై ఓటు వేసి ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకై పోరాడదాం.. అని పార్టీ ఇల్లెందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం టేకులపల్లిలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో మూడోసారి ప్రధానమంత్రి కావాలని నరేంద్ర మోదీ దేశ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. గత ఎన్నికల్లో మోదీ ప్రభుత్వం హామీలను విస్మరించిందన్నారు. జన్‌ధన్ ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తానని, సంవత్సరానికి కోటి ఉద్యోగాలు ఇస్తానని, నల్లధనాన్ని వెలికి తీస్తానని భారత దేశానికీ అచ్చేదిన్ తీసుకొస్తానని అనేక వాగ్దానాలు చేసి ఏ ఒక్కటీ అమలు చేయలేదని ఆరోపించారు. తిరిగి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చేందుకు దేవుడి పేరుతో, కులం పేరుతో ముందుకొస్తున్నాడని దీనిని ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు విజ్ఞతతో ఆలోచన చేసి, బీజేపీని ఓడించాలని కోరారు. పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాడుతున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అభ్యర్థి మోకాళ్ల మురళీకృష్ణను గెలిపించుకోవాలన్నారు. డి.ప్రసాద్, కల్తి వెంకటేశ్వర్లు, గుగులోతు రామచందర్, ఎట్టి నరసింహారావు, ధరావత్ వెంకన్న, మేకల వినోద్, సమ్మయ్య పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: బీజేపీ, దాని మిత్రపక్షాల నుంచి దేశాన్ని కాపాడుకోవడంలో ప్రతీఒక్కరు ముందుకు రావాలని ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షురాలు అనురాధ పిలుపునిచ్చారు. మండలంలోని చల్లసముద్రం ఉమ్మడి గ్రామపంచాయతీ పరిధిలోని పెంకు పరిశ్రమలలో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేదల ప్రజల కోసం సుదీర్ఘ ఉద్యమాలు నిర్వహించి ప్రజలకు అండగా నిలిచిన న్యూడెమోక్రసీ అభ్యర్థి మురళీకృష్ణ కుండ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. దేశంలో పేదప్రజల కడుపుకొట్టి కార్పొరేట్ శక్తుల కడుపులు నింపడానికి... ముస్లిం, క్రిస్టియన్,, మైనారిటీ అనే విద్వేశాలను రెచ్చగొడుతూ ఓట్లు దండుకునే కుట్రతో బీజేపీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తోందని విమర్శించారు. బీజేపీని గెలిపిస్తే నియంత పాలన వస్తుందన్నారు. కార్యక్రమంలో జె.సీతారామయ్య, రాసుద్దీన్, ఏపూరి వీరభద్రం పాల్గొన్నారు.

పాత, కొత్త కలయికతో బలోపేతం


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందు: రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయటమే మనందరి లక్ష్యం అని, కాంగ్రెస్ పథకాలు నచ్చి వివిధ పార్టీల నుంచి చేరుతున్న వారిని కలుపుకుని పార్టీని బలోపేతం చేస్తామని, కొత్త, పాత కలయికల సమన్వయంతో పని చేసి 13వ తేదీన జరగనున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను అత్యధిక మెజార్టీలో గెలిపించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు. శుక్రవారం ఇల్లెందులోని జేకే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల నుంచి 70 మంది కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రిగా అయితే రాజ్యాంగ హక్కులు, రిజర్వేషన్లు ఉంటాయని తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డానియేల్, పులి సైదులు, ఎస్కే జానీ, పింగళి నరేష్, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, సయ్యద్ జానీపాషా, కొక్కు నాగేశ్వరరావు, జాఫర్, లక్ష్మణ్ ఉన్నారు.

కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే అభివృద్ధి ..


ఇల్లెందు: ఇందిరానగర్‌లో ఇంటింటి ప్రచారం

ఇల్లెందురూరల్: మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుందామని మండలంలో కాంగ్రెస్, యూత్‌కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పోలారం గ్రామపంచాయతీలో యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు ధరావత్ చంద్రశఖర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలోనే ఉపాధి హామీ పథకం, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, పోడు భూములకు పట్టాలు వంటి అనేక పథకాలు అమలు చేసిందని గుర్తుచేశారు. మరోసారి కాంగ్రెస్‌కు అవకాశం కల్పిస్తే మరిన్ని మేలైన పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బాదావత్ నరేష్, వినోద్, మహేష్, వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కొమ్ముగూడెం, సుభాష్‌నగర్, విజయలక్ష్మీనగర్, రాఘబోయినగూడెం, మిట్టపల్లి గ్రామపంచాయతీలలో కాంగ్రెస్ నాయకులు తాటి రాంబాబు, పూనెం సురేందర్,తాటి యశోధ, పూనెం కవిత, ధనసరి స్రవంతి, ఎట్టి హరికృష్ణ, ధనసరి రాజు, బియ్యని రజని, నవీన్ తదతరులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కొమ్ముగూడెంలో ఉపాధి పథకం పనిప్రదేశంలో ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్‌ను గెలిపించాలని కోరారు.

అసెంబ్లీ ఫలితాలే పునరావృతం..

ఇల్లెందురూరల్: పార్లమెంట్ ఎన్నికల్లోనూ అసెంబ్లీ ఫలితాలే పునరావృతం అవుతాయని కాంగ్రెస్ నాయకుడు చీమల వెంకటేశ్వర్లు అన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను గెలిపించాలని కోరుతూ మండలంలోని సుభాష్‌నగర్‌లో శుక్రవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ప్రకటించిన గ్యారంటీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. ఆగస్టు నాటికి మిగతా హామీలన్నీ అమలు చేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం మరింత మెరుగైన పాలన అందించేందుకు పార్లమెంట్ ఎన్నికల్లో బలరాంనాయక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాలవెల్లి నర్సింహారావు, ఆముదాల ప్రసాద్, ఊరకొండ ధనుంజయ్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: ఇండియా కూటమి అభ్యర్థి, మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం సీపీఐ, సీపీఎం, టీడీపీ నేతలు పట్టణంలోని ఆంబజార్‌లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.సారయ్య, అబ్దుల్ నబీ, ముద్రగడ వంశీ మాట్లాడుతూ... కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన పోరిక బలరాం నాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఇంటింటి ప్రచారం..

మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బలరాం నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ నేతలు ఇంటింటి ప్రచారం చేపట్టారు. శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ జి.రవి మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని 19వ వార్డు కౌన్సిలర్ పత్తి స్వప్న ఆధ్వర్యంలో, ఇందిరానగర్‌లో కాంగ్రెస్ మహిళా నాయకురాలు పేరాల విశాలక్షి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మేకల శ్యామ్ ఆధ్వర్యంలో బలరాం నాయక్ గెలుపును కాంక్షిస్తూ మద్దతు ప్రకటించారు.